క్లుప్తంగా

ఎమ్మెల్యే కన్నాకు ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి పరామర్శ



సత్తెనపల్లి: శస్త్రచికిత్స చేయించుకున్న సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి బుధవారం పరామర్శించారు. ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని పుష్పగుచ్ఛం అందించి ఆకాంక్షించారు.

ఎస్వీ రంగారావుకు ఘన నివాళి



సత్తెనపల్లి: ప్రముఖ నటుడు ఎస్వీ రంగారావు జయంతి వేడుకలు పట్టణంలోని ఎన్టీఆర్ కళా క్షేత్రం ఎదుట బుధవారం ఘనంగా జరిగాయి. బి. సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ రావూస్ వైద్యశాల డాక్టరు వి. కృష్ణంశెట్టి, రాజుపాలెం మాజీ జడ్పీటీసీ మర్రి వెంకట్రామిరెడ్డి, నరిశేటి తాండవకృష్ణలు ప్రసంగించారు. ఎస్వీఆర్ నటనను కొనియాడారు. ముందుగా ఎస్వీ రంగారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కళాకారులు గంగూరి వెంకట్రావు, బత్తుల సుధాకర్, తోట ఏడుకొండలు, దివ్వెల శ్రీనివాసరావు, కేదారి రమేష్, శిఖ ఆదాం, రామిశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే ల్యాబ్‌ల నిర్వహణ

సత్తెనపల్లి: పట్టణంలో నిబంధనలకు అనుగుణంగానే ల్యాబ్‌ల నిర్వహణ ఉందని ల్యాబ్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ నాసర్ బాషా, కార్యదర్శి గడ్డం వీరాంజనేయులు పేర్కొన్నారు. అసోసియేషన్ సర్వసభ్య సమావేశం బుధవారం పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాసర్ బాషా మాట్లాడుతూ పట్టణంలో అన్ని ల్యాబ్‌లకు అనుమతులు ఉన్నాయని చెప్పారు. కొంతమంది సామాజిక మాధ్యమాల్లో అసత్య ఆరోపణలు చేస్తున్నారని, ఇది సరైనది కాదని ఖండించారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు, తదితరులు ఉన్నారు.

మహాసభ కరపత్రాల ఆవిష్కరణ



సత్తెనపల్లి: మాదిగ జన జాతర మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీస్ సీనియర్ నాయకుడు రెడ్డెబోయిన ప్రసన్నకుమార్ మాదిగ పిలుపునిచ్చారు. పట్టణంలోని డాక్టర్ బాబు జగజ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద బుధవారం జన జాతర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాదిగ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ 30వ వార్షికోత్సవం సందర్భంగా ఈదుముడి గ్రామంలో వ్యవస్థాపకుడు ఉసురు పాటి బ్రహ్మయ్య మాదిగ నాయకత్వంలో సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు చింతపల్లి గంగాధర్ ఆధ్వర్యంలో 7న జరిగే ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా కన్వీనర్ పేరు పోగు రామయ్య మాదిగ, పల్నాడు జిల్లా కో కన్వీనర్ గుండాల నగేష్ మాదిగ, సత్తెనపల్లి నియోజకవర్గ నాయకుడు చింతపల్లి నాగరాజు మాదిగ, గర్నెపూడి ఆనంద్ మాదిగ, దారా మరియదాస్ మాదిగ, గడ్డిపర్తి సుందర రావు మాదిగ, చిలక రాజు మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

అలా నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా



సత్తెనపల్లి: మున్సిపల్ చైర్ పర్సన్‌ను అడ్డం పెట్టుకొని రూ.3 కోట్లు సంపాదించినట్లు న్యాయవాది కొమ్మిశెట్టి సాంబశివరావు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త చల్లంచర్ల సాంబశివరావు సవాల్ చేశారు. పట్టణంలోని తన గృహంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయవాది కొమ్మిశెట్టి సాంబశివ రావు, బిల్డర్ వెంకట్రావు చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, నాయకులు అచ్చుత శివప్రసాద్, తుమ్మల వెంకటేశ్వరరావు, పెద్దింటి వెంకటేశ్వర్లు(చిట్టి), వరికల్లు కోటేశ్వర రావు, వాకుమళ్ళ చెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రసాయనం.. అతిగా వాడితే అనర్థం!

- రసాయన మందుల పిచికారీలో జాగ్రత్తలు అవసరం
- మోతాదుకు మించితే పంట దిగుబడికే తీవ్ర నష్టం
- రైతులు జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు, అధికారులు



పంటకు పిచికారీ చేస్తున్న రైతు

తాడేపల్లి రూరల్: ఆధునిక టెక్నాలజీ పెరుగుతున్నా... వ్యవసాయం మాత్రం 'వ్యయ'సాయంగా మారింది. రైతులు సరికొత్త పద్ధతుల్లో పంటల సాగు చేయడంతో రసాయనిక పురుగు మందుల వినియోగం కూడా రోజురోజుకూ పెరిగిపోతోంది. విత్తనాలు చల్లడం నుంచి పంట కోతకు వచ్చే వరకూ పురుగుమందు వాడకంపై రైతులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలి. లేని పక్షంలో పంట దిగుబడి దెబ్బతినడంతో పాటు రైతు నష్టాలబారిన పడాల్సి వస్తుంది. అధికంగా పురుగు మందులు వినియోగిస్తే ప్రమాదమని వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. మోతాదుకు మించి రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగిస్తే పంటపై ప్రభావం పడుతుందని, తప్పకుండా రైతులు వ్యవసాయ సిబ్బంది సలహాలు, సూచనలు పాటించాలని తెలియజేస్తున్నారు.

క్రిమి సంహారక మందులు, రసాయనిక ఎరువులు అధికంగా వినియోగిస్తే భూసారం తగ్గడంతో సహజత్వాన్ని కోల్పోతాయి. దీంతో లాభం కంటే నష్టం అధికంగా ఉంటుంది. పంటలకు నీటితడి అందించిన తర్వాత ఉదయం వేళల్లో పంటలకు పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది. 25 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్న సమయంలో పంటలకు పిచికారీ చేయాలి. రైతులు పలు జాగ్రత్తలు తీసుకుని పిచికారీ చేస్తే ప్రమాదాల నుంచి గట్టెక్కవచ్చని ఇటు వైద్యులు, అటు వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

రసాయనాలు పిచికారీ చేసే సమయంలో ఈ జాగ్రత్తలు తీసుకోవాలి...

- గాలికి ఎదురుగా రసాయన మందులు పిచికారీ చేయరాదు.
- తెగులు మందు, పురుగుమందు కలిపి పిచికారీ చేయరాదు.
- చేతలకు గ్లౌజులు, నోరు, ముక్కుకు మాస్కులు వేసుకోవాలి.
- మందులు పిచికారీ చేసే సమయంలో కళ్లు, ముక్కు, నోరు, చేతులతో రుద్దుకోరాదు. వాడిన పురుగు మందుల డబ్బాలు ఎక్కడబడితే అక్కడ వేయరాదు.
- రసాయన మందులు పిచికారీ సమయంలో స్ప్రేయర్లకు లీకేజీ ఉండరాదు.
- ద్రావణం కలిపే మందు డబ్బాపై సూచించిన మేరకు గానీ, వ్యవసాయ అధికారులు సూచించిన మేరకు గానీ పిచికారీ చేయాలి.
- పిచికారీ చేసే సమయంలో బీడీలు, సిగరెట్లు తాగరాదు.
- భోజనానికి ముందు చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.
- రసాయన మందు పిచికారీ చేసే సమయంలో కడుపుమంట, దద్దుర్లు వస్తే సమీపంలో ఉన్న వైద్యుడిని సంప్రదించాలి.

జాగ్రత్తలు పాటించాలి



పంటలపై క్రిమి సంహారక మందులు పిచికారీ చేసే సమయంలో రైతులు తప్పని సరిగా జాగ్రత్తలు పాటించాలి. అస్వస్థతకు గురైన వెంటనే సమీపంలోని వైద్యుడిని సంప్రదించాలి. పురుగుమందు పిచికారీ చేసే సమయంలో కళ్లు, ముక్కు, నోటిలోకి రసాయన మందు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. చేతులను శుభ్రంగా కడుక్కుని భోజనం చేయాలి. లేకుంటే రసాయన ద్రావణం లోపలికి వెళ్లే ప్రమాదం ఉంది.

–డాక్టర్ అబ్దుల్ రహమాన్, దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు

మోతాదుకు మించి వాడరాదు



వ్యవసాయ సిబ్బంది సూచించిన మేరకు తగిన మోతాదులో పంటకు ఉదయం వేళల్లో పిచికారీ చేయాలి. ముఖానికి మాస్కులు, చేతులకు గ్లౌజులు, కళ్లకు అద్దాలు ధరించి పిచికారీ చేయాలి. కలుపుమందు కొట్టిన తరువాత పురుగుమందు కొట్టరాదు. మొక్కల పై భాగంతో పాటు కిందభాగం తడిసిపోయేలా పిచికారీ చేస్తే ఆకు కింద ఉన్న రసం పీల్చే పురుగులు నశిస్తాయి.

–శ్రీనివాస్ రెడ్డి, అగ్రికల్చర్ ఏడీ

వానల వేళ.. జాగ్రత్త పడాలి చాలా...

- పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు
- వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతే ఎంతో కీలకం
- సకాలంలో వైద్య పరీక్షలు, మందులు ముఖ్యం

సత్తెనపల్లి: వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ కాలంలోనే డెంగీ, మలేరియా పెరిగే ప్రమాదం ఉంది. జ్వరాలతో ఆసుపత్రులకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. వ్యాధులపై వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రజలు ఇళ్లల్లో కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధుల బారిన పడకుండా రక్షించుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు ప్రబలకుండా ఉంటాయి. టైఫాయిడ్, డెంగీ, మలేరియా, కామెర్లు, డయేరియా వంటి వ్యాధులు రాకుండా అరికట్టవచ్చు. పంచాయతీ శానిటరీ విభాగం కూడా ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, మురుగు ప్రాంతాల్లో హైపో పిచికారి చేసే ప్రక్రియను ప్రారంభించాల్సి ఉంది.

వైద్య సిబ్బంది విస్తృత అవగాహన...

స్టాప్ డయేరియాలో భాగంగా పణిదం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పరిధిలోని ఇంటింటికీ అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు వెళ్తున్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు పంపిణీ చేస్తున్నారు. విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాక చేతులు శుభ్రత తదితరాలపై చైతన్యం తెస్తున్నారు. డయేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. ఎక్కడైనా జ్వరాలు ఉన్నట్లు అనిపిస్తే వెంటనే సమీపంలోని వైద్యశాలలకు బాధితులను తరలించేందుకు ఏర్పాట్లు కూడా చేస్తున్నారు.

ఉపాధి హామీ కింద పండ్లతోటల పెంపకం



అంచులవారిపాలెం సమీపంలోని జామతోటను పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

రాజుపాలెం : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సన్న, చిన్నకారు రైతులు పండ్లతోటలు వేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఎంపీడీవో ఎస్ రామకృష్ణప్రసాద్, ఏపీవో సీహెచ్ వెంకటేశ్వర్లులు తెలిపారు. మండలంలోని అంచులవారిపాలెం, అనుపాలెం గ్రామాలలో ఉపాధిహామీ పథకం ద్వారా వేసిన పండ్ల తోటలను రైతులతో కలసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని ఐదెకరాల లోపు పొలం ఉన్న రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. వారు జాబ్‌కార్డు కూడా కలిగి ఉండాలని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగం లేనివారికే ఈ అవకాశం ఉందని చెప్పారు. పండ్లతోట వేసుకునే రైతులు శాశత నీటి సౌకర్యం, బోరు బావులు కలిగి ఉండాలని తెలిపారు. చెప్పారు. మండలంలోని 17 ఎకరాలలో పండ్ల తోటలు వేశారని చెప్పారు. మామిడి, జీడి మామిడి, బత్తాయి, కొబ్బరి, మునగ, సపోట, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్స్, జామ, తైవాన్‌జామ, నిమ్మ, నేరేడు, యాపిల్‌బేర్, అంజూర మొదలైన తోటలు వేసుకోవచ్చని తెలిపారు. పూల తోటల పెంపకం కింద గులాబీలు, గుండుమల్లెలు, తోటలు వేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తిగల రైతులు మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీడీవోను, ఏపీవోను సంప్రదించాలని కోరారు.

ఎస్సీ రైతులకు టార్పాలిన్ పట్టలు పంపిణీ



టార్పాలిన్ పట్టలను అందుకుంటున్న రైతులు

అమరావతి : అత్తలూరు ఆర్గానిక్స్ ద్వారా మండల పరిధిలోని పలు గ్రామాల రైతులకు సంస్థ తరఫున అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం మండలంలోని మల్లాది గ్రామంలో ఆర్గానిక్ వ్యవసాయం చేస్తున్న 29మంది రైతులకు మిరపకాయలు ఆరబోసుకునేందుకు అవసరమైన టార్పాలిన్ పట్టాలను పంపిణీ చేశారు. క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెంపా జ్వాలాలక్ష్మీ నరసింహారావు చేతుల మీదుగా రైతులకు పట్టాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంపా వాసులతో పాలు గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

డయేరియా నివారణపై అవగాహన



రెడ్డిగూడెం ఉర్దూ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

రాజుపాలెం : ప్రాథమిక ఆరోగ్యకేంద్ర సిబ్బంది పరిశుభ్రతపై బుధవారం అవగాహన కల్పించారు. మండలంలోని గణపవరం, రెడ్డిగూడెం, నెమలిపురి మండల పరిషత్ పాఠశాలలో డయేరియా నివారణ నియంత్రణ చర్యలలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ అధికారి అలేఖ్య, ఏఎన్ఎంలు ప్రమీల, నాగమణిలు ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు శుభ్రతపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఐదేళ్లలోపు చిన్నారులు డయేరియా బారిన పడకుండా సూచనలు చేశారు. పిల్లల తల్లులకు డయేరియా గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్త విమల, ఆశా కార్యకర్తలు దీవెన, సంతోషం, ఎస్తేర్‌రాణి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని ఇరుకుపాలెం గ్రామంలో డెంగీ నివారణ మాసోత్సవాలలో భాగంగా బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో హెల్త్ సూపర్‌వైజర్ ఏ పీటర్‌డేమియన్ పాల్గొన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దోమ తెరలు వాడాలని, ఫ్రైడేను డ్రై డేగా పాటించి ఇంట్లోని పాత వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో వైద్య సిబ్బంది, గ్రామస్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఏఎన్ఎం శాంతి, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మూగజీవాలకు వ్యాధి నిరోధక టీకాలు



టీకాలు వేస్తున్న దృశ్యం

క్రోసూరు: పశుసంవర్ధకశాఖ నిర్వహిస్తున్న మూగజీవాలకు నీలిరంగు నాలుక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం బుధవారం మండల వైద్యులు డాక్టర్ సీహెచ్ మల్లయ్య ఆధ్వర్యంలో జరిగింది. మండలంలోని బయ్యవరం, ఊటుకూరు, దొడ్లేరు గ్రామాల్లో టీకాలు వేశారు. బయ్యవరంలో 800, ఊటుకూరులో 200, దొడ్లేరులో 200 జీవాలకు నివారణ టీకాలు వేసినట్లు వైద్యులు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెల్లపశువులకు ముద్ద చర్మ వ్యాధి నివారణ టీకాలు కూడా వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గోపాలమిత్రలు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దూరం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రదీప్

సత్తెనపల్లి: అతిసార వ్యాధి విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వి ప్రదీప్ అన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధి నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. సత్తెనపల్లి మండలం ఫణిదంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒకటో తేదీ నుంచి ఆగస్టు 31 వరకు స్టాప్ డయేరియా పేరిట అవగాహన సదస్సులు నిర్వహించేలా ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు, పెద్దలకు వాంతులు, విరోచనాలు అయితే ఓఆర్ఎస్ ద్రావణాన్ని అందించాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు ప్రతి గ్రామంలో సంబంధిత ఆరోగ్య సిబ్బంది వద్ద అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీరు, క్లోరినేషన్ చేసిన నీటిని తాగాలని సూచించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో వర్షం, మురుగు నీరు నిలువ లేకుండా చూడాలన్నారు. పరిసరాలను శుభ్రం చేసుకుని దోమలు పెరగకుండా అరికట్టుకోవాలని సూచించారు. వేడి ఆహార పదార్థాలను తినాలని, వండిన ఆహార పదార్థాలపై మూతలు ఉంచాలని తెలిపారు. గ్రామాల్లో వీటిపై అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించి, స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఎక్కువ సార్లు నీళ్ల విరోచనాలు, వాంతులు అయితే వైద్యులను సంప్రదించేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఇంటిలోనూ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని, ఎవరికైనా వ్యాధి లక్షణాలు కలిగి ఉంటే వెంటనే ఆశ వర్కర్లు, ఏఎన్ఎం, వైద్యాధికారులను సంప్రదించి వైద్యం పొందాలని స్పష్టం చేశారు. డయేరియా వ్యాధి బారిన పడిన వారు ఓఆర్ఎస్ తీసుకొని, జింక్ టాబ్లెట్లను వేసుకోవాలని తెలిపారు. అవసరమైన మందులు ప్రతి గ్రామంలోనూ వైద్య సిబ్బంది వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు. సమావేశంలో ఆరోగ్య విస్తరణ అధికారి పి. శ్రీనివాసరావు, పీహెచ్ఎన్ జీవీసీకే మీనాక్షమ్మ, ఆరోగ్య పర్యవేక్షకురాలు ఏ వరలక్ష్మి, ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కౌలు కార్డులుంటే ఎన్నో ప్రయోజనాలు



రాజుపాలెం : ప్రతి కౌలు రైతుకు ప్రభుత్వ ప్రయోజనాలు అందజేసేందుకే వారికి గుర్తింపు కార్డులు ఇస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి పి.వెంకటనర్సయ్య తెలిపారు. మండలంలోని గణపవరం రైతు భరోసా కేంద్రంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులపై అవగాహన సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రంలో కౌలు కార్డుకు దరఖాస్తు చేస్తే వీఆర్వో ద్వారా అందిస్తామని తెలిపారు. కార్డు కోసం భూ యజమాని పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్ కాపీ, కౌలు రైతు పాస్‌పోర్టు ఫొటోతో దరఖాస్తు చేయాలని కోరారు. కౌలు రైతులకు కార్డు ఉంటే ప్రభుత్వ పథకాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని కండ్రిక వాసి దుర్మరణం

నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం పాలైన సంఘటన గుంటూరు–కర్నూలు జాతీయ రహదారిపై సాతులూరు గ్రామం సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై జె.బలరామ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు ఫిరంగిపురం మండలం కండ్రిక గ్రామానికి చెందిన దేవరపల్లి చంద్రశేఖర్ (40) కూలిపనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. తన ద్విచక్రవాహనంపై నరసరావుపేటకు వెళ్లి కూలీ పనులు చేసుకుని తిరిగి స్వగ్రామం కండ్రికకు వస్తుండగా సాతులూరు సమీపంలోని పెద నందిపాడు మేజర్ కాలువ వద్దకు రాగానే గుంటూరు వైపు నుంచి వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో చంద్రశేఖర్ తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న మృతుడి కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రక్తపుమడుగులో విగతజీవిగా పడి ఉన్న చంద్రశేఖర్ మృతదేహాన్ని చూసి రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. తమకు న్యాయం జరిగే వరకూ కదిలేది లేదని రోడ్డుపై గంట పాటూ బైఠాయించారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయి ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎస్సై జె. బలరామ్‌రెడ్డి, యడ్లపాడు ఎస్సై రాజీవ్‌సామేల్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన నిర్వహిస్తున్న వారిని సముదాయించి వారిచే ఆందోళన విరమింప చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతుడికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు.

రైతుభరోసా కేంద్రాల్లో రాయితీపై విత్తనాలు

ఏవో రామారావు



పురుగు మందులను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి రామినేని రామారావు

శావల్యాపురం: వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సమయంలో మెట్ట పంటలు సాగు చేయు అన్నదాతలకు ఆరుతడి పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు కోరారు. బుధవారం స్థానిక మన గ్రోమోర్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతుభరోసా కేంద్రాల్లో రాయితీపై ఎల్‌పిజీ 52 రకం కంది విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, అందులో భాగంగా గుంటుపాలెం -10 క్వింటాలు, కనమర్లపూడి-05, కారుమంచి-06, కొత్తలూరు-02, మతుకుమల్లి-06, పొట్లూరు-10, వేల్పూరు 01-02, వేల్పూరు2 -6 క్వింటాలు కంది విత్తనాలు ఉన్నట్లు తెలిపారు. 04 కేజీల సంచి రాయితీ మినహాయించి 391.44 పైసలు చెల్లించాలన్నారు. అలాగే పచ్చిరొట్టి ఎరువులు జీలుగు, జనుము, పిల్లిపెసర విత్తనాలు కూడా రైతులకు రాయితీపై ఇస్తున్నట్లు తెలిపారు. అర్హత కల్గి ఉన్న రైతులందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూమిలో పోషకాలు తగ్గకుండా ఉండటానికి సేంద్రీయ ఎరువులు వినియోగం అధికంగా వాడాలన్నారు. ఒక్కో రైతుభరోసా కేంద్రం పరిధిలో 42 మట్టి నమూనా శాంపిల్స్ సేకరించి భూసార పరీక్షలు ప్రభుత్వ పరంగా ఉచితంగా చేయిస్తున్నామన్నారు.

భూసార పరీక్షలు ఆధారంగా భూమిలో పోషకాలు తగ్గిపోకుండా ఉండటానికి భూసార పరీక్షల ఎంతోగానో దోహదపడతాయన్నారు. అనంతరం మన గ్రోమార్ సెంటరులో ఎరువుల నిల్వలు రికార్డులు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఆయనతో పాటు మన గ్రోమార్ సెంటరు మేనేజరు చిలకత్తిని సురేంద్ర కుమార్, ఏఈవో పురేటి అశోక, వీఏఏ వెంకయమ్మ తదితరులు ఉన్నారు.

హోంగార్డు కుటుంబానికి రూ.5 లక్షలు అందజేత



పదవీ విరమణ చేసిన హోంగార్డు ఎర్రస్వామిని అభినందిస్తున్న జిల్లా ఎస్పీ మలికాగార్గ్



మృతిచెందిన హోంగార్డు సాయిబాబా కుటుంబ సభ్యులకు చెక్ అందజేస్తున్న ఎస్పీ

నరసరావుపేట: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన హోంగార్డు కె.సాయిబాబా కుటుంబ సభ్యులైన తల్లి, కుమారుడికి జిల్లా ఎస్పీ మలికా గార్గ్ రూ.5 లక్షల చెక్ బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. ఈ మొత్తాన్ని జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డులు అందరూ తమ ఒకరోజు వేతనం కలెక్ట్ చేసి సహాయం చేశారు. వీరిని జిల్లా ఎస్పీ అభినందించారు. అలాగే 35 ఏళ్లపాటు హోంగార్డుగా పనిచేసి పదవీ విరమణ పొందిన ఎర్రస్వామిని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మలికాగార్గ్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ జీఎం గాంధీ, హోంగార్డు ఆర్ఐ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

దాతలూ... సహకరించండి

నరసరావుపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు సహకారం అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. కృష్ణవేణి విద్యాసంస్థల ఆధ్వర్యంలో బుధవారం ఎస్ఆర్‌కేటీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ పాల్గొని పేద విద్యార్థులకు రూ.30 వేల విలువైన నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయా లని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనలో తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనుభవం గల ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల సొంతం అని, ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించి తాను వైద్యునిగా సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ నాతాని వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గురులింగం, ఉపాధ్యాయులు కె.సుధాకర్, యస్వీ సుబ్బారావు, యం.అపర్ణ తదితరులు పాల్గొన్నారు.